


రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మోపర్తి రామాంజనేయులు (రాజమహేంద్రవరం) బుధవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



9,850 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 2,950, మధ్య డెల్టాకు 1,900, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని వదిలారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సాయంత్రం)	సహర్ శుక్రవారం (ఉదయం)
రాజమండ్రి	6.21	4.52
కాకినాడ	6.21	4.51
అమలాపురం	6.21	4.51



భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, యువత



కలెక్టరేట్ వద్ద పార్టీ శ్రేణులు, విద్యార్థులు, నిరుద్యోగుల ఆందోళన



జేసీ చిన్నరాముడుకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

దగాపై నిరసన సెగ

- 'యువత పోరు'లో కదం తొక్కిన విద్యార్థులు, నిరుద్యోగులు
- మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపుతో పోటెత్తిన యువత
- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ భారీ బైక్ ర్యాలీ
- కూటమి సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- జేసీకి వినతిపత్రం



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ నేతలు వేణు, వనిత, తలారి వెంకట్రావు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, జక్కంపూడి రాజా తదితరులు



ర్యాలీగా వస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

సాక్షి, రాజమహేంద్రవరం: సర్కారు వారి దగాపై నిరసన సెగ ఎగసింది. విద్యార్థులు, నిరుద్యోగులపై కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ.. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన 'యువత పోరు' ఆందోళనలో.. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కదం తొక్కారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం యువతకు తక్షణం ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు, నిరుద్యోగులు తరలివచ్చారు. వారికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎంపీ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, రాజమండ్రి పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, యువనేత జక్కంపూడి గణేష్ తదితరులు మద్దతుగా నిలిచారు. ఆందోళనలో భాగంగా బొమ్మూరులోని పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆందోళన నేపథ్యంలో కలెక్టరేట్ మార్గం వెంబడి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలోకి ర్యాలీ రాకుండా బారికేడ్లు పెట్టారు. అయితే అధిక సంఖ్యలో యువత, విద్యార్థులు రావడంతో బారికేడ్లను పక్కకు తొలగించక తప్పలేదు. కలెక్టరేట్ లోపలికి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను మాత్రమే అనుమతించారు. అనంతరం నేతలు జాయింట్ కలెక్టర్ చినరాముడుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

మండిన ఎండను లెక్క చేయకుండా..

తీవ్రమైన ఎండ వేడిని సైతం లెక్క చేయకుండా పార్టీ జెండాలు పట్టుకుని పెద్ద ఎత్తున యువత ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, వాటిని అమలు చేయనందుకు నిరసనగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కూటమి నేతల మాయమాటలు నమ్మి తాము మోసపోయామన్న సంగతిని గుర్తించిన ప్రజలు వైఎస్సార్ సీపీ పోరాటానికి విశేషంగా మద్దతు తెలిపారు. పార్టీ నేతలు తమ ప్రసంగాల్లో ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టారు. విద్యార్థులు, యువతకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్రంలో హిట్లర్‌ను మించిన పాలన కొనసాగుతోందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న గొంతును అణగదొక్కుతున్నారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్‌లో ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, తొలి సంతకం చేసిన డీఎస్సీ వాయిదా వేస్తున్నందుకు సిగ్గుపడాలని అన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ, 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో చంద్రబాబు నాయుడు చెప్పింది ఏనాడూ చేయలేదని అన్నారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించి పబ్బం గడుపుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పార్టీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు అనసూరి పద్మలత, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు, నాయకులు నందెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీ

'యువత పోరు'కు మద్దతుగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, యువనేత జక్కంపూడి గణేష్ ఆధ్వర్యాన భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రకాష్ నగర్‌లోని రాజా నివాసం వద్ద ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ నందం గనిరాజు జంక్షన్, బైపాస్ రోడ్డు తాడితోట, స్టేడియం రోడ్డు, శ్యామలా టాకీస్ జంక్షన్, కోటిపల్లి బస్టాండ్, ఐదు బళ్ల మార్కెట్ మీదుగా బొమ్మూరులోని రాజమహేంద్రవరం రూరల్ పార్టీ కార్యాలయానికి చేరుకుంది. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకూ సాగింది. ర్యాలీలో పార్టీ శ్రేణులతో పాటు, యువత వేలాదిగా పాల్గొన్నారు.

టీడీపీ అబద్ధాల పుట్ట



విద్యార్థులు, యువతకు మద్దతుగా వైఎస్సార్ సీపీ చేపట్టిన 'యువత పోరు' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలేనని, ఇలా అబద్ధాలతో ఆకలి కడుపులు నింపలేరని ప్రజలే గుర్తించారు. విద్య, వైద్యం అనే ప్రధాన అవసరాలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. మాజీ సీఎం జగన్‌పై కూటమి నాయకులు లేనిపోని అబద్ధాలు చెప్పారని, రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లోకి వెళ్లిపోయిందంటూ అసత్య ప్రచారాలు చేశారని ప్రజలు గమనించారు. నిరుద్యోగ భృతి, ఫీజు బకాయిలు తక్షణం ఇవ్వాలి. రూ.4,600 కోట్ల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి. జగన్ ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలని చూస్తున్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాబుకు తెలియదా?



పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే సీఎం చంద్రబాబుకు హామీలు ఇచ్చే సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా? గత ప్రభుత్వం అప్పులు చేయడం వల్లనే సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేకపోతున్నామని అసెంబ్లీలో చంద్రబాబు చెప్పడం చూస్తుంటే ఆయన అనుభవం ఎక్కడికి పోయిందో అర్థం కావడం లేదు. తప్పుడు వాగ్దానాలు చేసి తల్లిదండ్రులను, నిరుద్యోగులను, యువతను చంద్రబాబు మోసం చేశారు. మాజీ సీఎం జగన్‌పై అనవసర విమర్శలు మాని, ఇచ్చిన హామీలు నెరవేర్చడంపై దృష్టి పెట్టడం చంద్రబాబు, లోకేష్‌లకు మంచిది.

– తానేటి వనిత, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి

ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం దారుణం. సూపర్ సిక్స్ హామీల్లో ఏ పథకానికి ఎన్ని నిధులు బడ్జెట్‌లో కేటాయించారు? మెగా డీఎస్సీపై తొలి సంతకం కూడా చేశారు. తీరా చూస్తే 16 వేల పోస్టులు ఏరకంగా భర్తీ చేస్తారో అర్థం కాని పరిస్థితి. అటువంటప్పుడు సంతకానికి విలువేముంది? ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని, ఇచ్చిన హామీలన్నీ బేషరతుగా అమలు చేయాలి. లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తాం.

– మార్గాని భరత్‌రామ్, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

హామీలు తుంగలో తొక్కడం కూటమి నైజం



కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. పథకాలు ఇవ్వకుండా దగా చేసింది. ఇచ్చిన హామీలు తుంగలో తొక్కడం, ప్రజలను పక్కదారి పట్టించడం కూటమి ప్రభుత్వ నైజం. 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో కనీస కేటాయింపులు కూడా చేయలేదు. పేద పిల్లలపై కూటమి సర్కార్ కక్ష సాధింపు చేస్తోంది.

– డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి

ప్రైవేటీకరణ ఆపాలి



కూటమి ప్రభుత్వం చేపట్టాలనుకున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను తక్షణం ఆపాలి. ఇచ్చిన హామీలు అమలు చేయాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి. ప్రతి ఇంట్లో యువత ఉన్నత చదువులు చదువుకుని, జీవితంలో స్థిరపడేందుకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేశారు. రూ.4.76 లక్షల కోట్ల విలువైన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది.

– తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి

ఉన్న ఉద్యోగాలు తీసేస్తున్నారు



కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోంది. ఫలితంగా కొత్తగా ఉద్యోగాల మాట దేవుడెరుగు.. ఉన్న ఉద్యోగాలు పోతున్నాయి. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో వచ్చిన కంపెనీలు, పారిశ్రామిక సంస్థలు.. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న శాంతి భద్రతల సమస్యకు భయపడి వెనక్కి పోతున్నాయి. కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా ఇచ్చే పరిస్థితి లేదు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి, ఐదు క్వార్టర్స్‌కు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో పెట్టడం దారుణం.

– జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే

ప్రజాభ్యుదయమే పరమావధి

- ప్రజా సమస్యల పరిష్కారంపై నిరంతర పోరాటం
- జిల్లాలో ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
- కేక్ కట్ చేసి, జెండా ఆవిష్కరించిన నేతలు



పార్టీ జెండా ఎగురవేసి, వందనం చేస్తున్న చెల్లుబోయిన వేణు. చిత్రంలో తానేటి వనిత, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు



సిటీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న మార్గాని భరత్ రామ్, రౌతు సూర్యప్రకాశరావు, మార్గాని నాగేశ్వరరావు

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రజాభ్యుదయమే పరమావధిగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, సవాళ్లను సోపానాలుగా మలచుకుని ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ.. మహానేత వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న పార్టీ వైఎస్సార్ సీపీ అని పార్టీ నేతలు అన్నారు. రాజకీయాల్లో నైతిక విలువలను చాటి చెప్పిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అంటూ ప్రజలకు భరోసా ఇస్తూ ముందుకు వెళుతున్నారని కొనియాడారు. జగన్ చెప్పారంటే.. చేస్తారంతే.. అంటూ ప్రజల్లో నమ్మకం, విశ్వాసం గడించిన పార్టీగా వైఎస్సార్ సీపీ చరిత్ర సృష్టించిందని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం జిల్లావ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు కేక్‌లు కట్ చేసి, పార్టీ జెండాలు ఆవిష్కరించారు.

రాజమండ్రి రూరల్

వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కార్యాలయంలో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యాన పార్టీ జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రజా శ్రేయస్సు, సమస్యల పరిష్కారానికి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, చందన నాగేశ్వర్, గిరిజాల బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రి సిటీ

ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ పిలుపునిచ్చారు. మార్గాని ఎస్టేట్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర బీసీ నాయకుడు మార్గాని నాగేశ్వరరావు, నాయకులు అడపా శ్రీహరి, నక్కా శ్రీనగేష్, పోలు విజయలక్ష్మి, వాసంశెట్టి గంగాధరరావు, దాసి వెంకట్రావు, బిల్డర్ చిన్న, కానుబోయిన సాగర్, మార్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి

రాష్ట్రంలో భవిష్యత్తులో ఏ ఎన్నిక జరిగినా వైఎస్సార్ సీపీదే ఘన విజయమని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎర్ర కాలువ వంతెన వద్ద దివంగత మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పార్టీ జెండా ఎగురవేశారు. అందరికీ స్వీట్లు పంచారు.

కొవ్వూరు

కొవ్వూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యాన పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. తలారి, పార్టీ శ్రేణులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కేట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

గోపాలపురం

దేవరపల్లి మండలం యర్నగూడెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మాజీ మంత్రి, పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత ఆధ్వర్యాన ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు.

నిడదవోలు

నిడదవోలు పట్టణంలోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వెలగడ బాలరాజు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,000
గటగట (వెయ్యి)	14,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ప్రాణం తీస్తున్న వేగం

- ర్యాష్ రైడింగ్, డ్రైవింగ్‌లతో యువత
- కన్నవారికి కడుపు కోత
- బైక్‌లపై విపరీతమైన వేగంతో ప్రయాణం
- ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో ఘోర ప్రమాదాలు
- తొలి తప్పిదం తల్లిదండ్రులదే అంటున్న పోలీసులు



అమలాపురంలో యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు

అమలాపురం టౌన్: చదువుకుని ఉద్యోగాలు సాధించి ఉన్నతమైన జీవితాన్ని చవిచూడక ముందే... తల్లిదండ్రులు వారిపై పెట్టుకున్న ఆశలు నెరవేరకుండానే కొందరు యువకులు రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్ని నిమిషాలు ఆలస్యమైనా గమ్యాన్ని చేరుకుంటాం, అతి వేగంతో జరగరానిది ఏదైనా జరిగితే మన వెనక ఉన్న కుటుంబం ఏమైయిపోతుందనే కనీస ఆలోచన, ముందుచూపు లేకుండా యువకులు రోడ్లపై రయ్ రయ్ మంటూ బైక్‌లను నడుపుతున్నారు. గత ఏడాది కాలంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అతి వేగంతో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 34 మంది వరకూ యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నెలలోనే ఉమ్మడి జిల్లాలో ఏడుగురు వరకూ రోడ్డు ప్రమాదాల్లో యువకులు మృత్యువాత పడ్డారు. ఐ.పోలవరం మండలం బాలయోగి వారధి (ఎదుర్లంక –యానాం వంతెన)పై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి యువకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయంటే అతి వేగమే కారణం. మన జాగ్రత్తలో మనం ఉండి..ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకూ రోడ్డు ప్రమాదాలు మన దరి చేరవు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో యువకులు రైడింగ్ మాదిరిగా బైక్‌ను అతివేగంగా నడపడం ఫ్యాషన్ అయిపోయింది. ఆధునాతన బైక్‌లను యమ స్పీడుగా నడుపుతూ మృత్యు కుహరాల్లోకి వెళుతున్నారు. యానాం –ద్రాక్షారామ రహదారిలో ఎక్సైజ్ అధికారులు వెంబడించడంతో ఓ యువకుడు అతి వేగంతో వెళ్లి ఓ లారీని ఢీకొట్టి ప్రాణాలు విడిచాడు. పి.గన్నవరం మండల ఎల్.గన్నవరం శివారు జొన్నల్లంకు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ ఏడాదిలో అతివేగమనే అనర్థంతో అర్ధంతరంగా యువకులు ప్రాణాలు పొట్టన పెట్టుకున్న రోడ్డు ప్రమాదాలు ఎన్నో ఉన్నాయి. యువకులు రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న సమయంలో వారు కనీసం హెల్మెట్ ధరించకపోవడం గమనార్హం.

ప్రమాదాలకు కారణాలు అనేకం

యువకులు రోడ్డు ప్రమాదాల్లో బలి అయిపోతున్న సంఘటనలకు కారణాలు అనేకం కనిపిస్తున్నాయి. అతి వేగం ప్రధాన కారమవుతుంటే దానికితోడు బైక్‌లతో రైడింగ్‌లకు దిగడం, మద్యం సేవించడం, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వచ్చీ రానీ డ్రైవింగ్‌తో కొందరు యువకులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. యువకులను బైక్‌ల డ్రైవింగ్ పరంగా కంట్రోల్ చేయక పోవడంలో తల్లిదండ్రులు ప్రధాన కారకులవుతున్నారు. గొప్పల కోసం వెళ్లి కొందరు తల్లిదండ్రులు తమ పిల్లోడికి ఖరీదైన, అధునాతన బైక్ కొనిచ్చామని ఆనందిస్తున్నారే తప్ప ఆ బైక్‌తో తమ బిడ్డ ఎన్ని తప్పిదాలు చేస్తున్నాడో ప్రాణాలు పోయాక గ్రహించి విలపిస్తున్నారు. డ్రైవింగ్‌లో నిష్ణాతులైన తర్వాతే బైక్ కొనిద్దామని ఆదిలోనే తల్లిదండ్రులు ఆలోచిస్తే ఇన్ని అనర్థాలు జరవగవని పోలీసులు అంటున్నారు. ఇంట్లో తల్లిదండ్రులు కూడా బైక్ డ్రైవింగ్‌పై తమ పిల్లలకు కౌన్సెలింగ్ ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.

ప్రాణాలు పోతుంటే బాధేస్తోంది



ఎంతో భవిష్యత్ ఉన్న కొందరు యువకులు రోడ్డు ప్రమాదాల్లో కేవలం అతివేగంతో ప్రాణాలు కోల్పోవడాన్ని చూస్తున్నప్పుడు బాధేస్తోంది. ట్రాఫిక్ నిబంధనలపై, హెల్మెట్ ధారణపై, అతివేగం వద్దని, విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని పోలీస్ శాఖ యువతకు నిత్యం కౌన్సెలింగ్‌లు ఇస్తోంది. ముఖ్యంగా యానాం –ఎదుర్లంక వారిధిపై జరగుతున్న యువకుల రోడ్డు ప్రమాదాలపై అధ్యయనం చేస్తున్నాం. యువకుల బైక్‌ల డ్రైవింగ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టి, వారు అతివేగం తగ్గించేలా చర్యలు చేపడతాం.

– టీఎస్ఆర్‌కే ప్రసాద్, డీఎస్పీ, అమలాపురం పోలీస్ సబ్ డివిజన్

పోలీసుల కౌన్సెలింగ్‌లను పెడచెవిన పెడుతున్న యువత

జిల్లా పోలీస్ శాఖ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, ముఖ్యంగా అతి వేగంతో వెళుతున్న యువతను నిరోధించేందుకు అనేక కౌన్సెలింగ్‌లు ఇస్తోంది. అలాగే ప్రతీ పట్టణం, గ్రామాల్లో హెల్మెట్ ధారణ ఎంత విలువనైదో, ప్రాణాలను ఎలా కాపాడుతుందో వివరిస్తూ ఫ్లెక్సీలను ప్రదర్శిస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సరికొత్త ట్రాఫిక్ రూల్స్, పెరిగిన జరిమానాలపై యువకులను రోడ్డు చెంతే పోలీసులు ఆపి కౌన్సెలింగ్ ఇస్తున్నా వారు వాటిని పెడచెవిని పెడుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోతే ఆ కుటుంబం ఎంత తల్లడిల్లుతుందో, ఎంత క్షోభను అనుభవిస్తుందో జిల్లా పోలీసులు వీడియోలు, ఆడియోలు, ఫ్లెక్సీలు ఎన్నో విడుదల చేస్తున్నా అవి కూడా యువకుల చెవులెక్కడం లేదు. ట్రాఫిక్ రూల్స్ పాటించని నిర్లక్ష్యమే నిండు ప్రాణాలను తీస్తోంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



యాళ్ల వీరేంద్ర



వేమవరపు సాంబశివ

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలం ఎదుర్లంక జీఎంసీ బాలయోగి వారధిపై మంగళవారం అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యానాం సుంకరపాలెం నుంచి మురమ్మిడివరం వైపు బైక్‌పై వస్తున్న ఇద్దరి వ్యక్తులను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన ఇద్దరూ తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామానికి చెందిన యాళ్ల వీరేంద్ర(26), ముమ్మిడివరం మండలం కొత్తలంక గ్రామానికి చెందిన వేమవరపు సాంబశివ(14)గా పోలీసులు గుర్తించారు. పోతుకుర్రులో జరిగే పుట్టినరోజు వేడుకలకు బంధువుతో కలసి వారు మోటారు సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఘటనా స్థలానికి స్థానిక ఎస్సై మల్లికార్జునరెడ్డి సిబ్బందితో కలసి వెళ్లి మృతదేహాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సుంకరపాలెం గ్రామానికి చెందిన యాళ్ల వీరేంద్ర లోడ్ ఆటో నడుపుతూ తండ్రి సూరిబాబుకు అండగా ఉండేవాడు. సూరిబాబుకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఉన్న ఒక్క కొడుకూ ఆటో నడుపుతూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. వీరేంద్ర మృతితో సుంకరపాలెంలో విషాద ఛాయలు అలుముకొన్నాయి. సాంబశివ కొత్తలంక హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు.

కౌలు రైతు ఆత్మహత్య



వెంకటేశ్వరరావు (ఫైల్)

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామానికి చెందిన కౌలు రైతు పశ్చెట్టి వెంకటేశ్వరరావు(45) ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో సొంత భూమితోపాటు కొంత కౌలుకి తీసుకుని వ్యవసాయం చేశాడు. వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పులు తీర్చలేక కొంతకాలం హైదరాబాద్‌లో పనిచేశాడు. ఇటీవల తిరిగి వచ్చి కాకినాడలో కూలిపని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి యానాం బీచ్‌కు వెళ్లి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్వరరావును యానాం పోలీసుల సహకారంతో కాకినాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. యానాం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి భార్య నాగలక్ష్మి, వివాహమైన కుమార్తెలు శ్రీదేవి, జ్యోతిశ్రీ ఉన్నారు. వెంకటేశ్వరరావు ఆకస్మిక మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


యువకుడి ఆత్మహత్య

అల్లవరం: ఎంట్రుకోన పంచాయతీ పరిధిలో వాసర్ల వారిపాలేనికి చెందిన వాసర్ల వెంకట సాయి సునంద్ (24) బుధవారం మధ్యాహ్నం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఫంక్షన్ నిమిత్తం వేరే ఊరు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చే లోగా ఫ్యాన్‌కు వేలాడుతున్నాడని తండ్రి వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. కొన ఊపిరితో ఉన్న వెంకట సాయిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి వీర వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై హరీష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

మృతదేహం స్వాధీనం

పెరవలి: పెరవలి మండలం లంకమాలపల్లి గ్రామం వద్ద బ్యాంక్ కెనాల్‌లో ఒక మృతదేహాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నామని పెరవలి ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి ఆవుగడ్డ మల్లికార్జున(40)గా అతనిని గుర్తించామని చెప్పారు. కాలువలో మృతదేహం కొట్టుకుంటూ ఇక్కడకు వచ్చి తుప్పల్లో ఆగిపోయిందని చెడు వాసన రావటంతో గ్రామస్తులు పరిశీలించి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వచ్చి మృతదేహాన్ని పైకి తీసి పోస్టుమార్టం కోసం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెంకటేశ్వరరావు తెలిపారు.

బీరు బాటిళ్లతో దాడికి పాల్పడిన నలుగురి అరెస్టు



సర్పవరం పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ 3వ డివిజన్ పరిధిలోని గుడారిగుంటలో ఒక మద్యం దుకాణం వద్ద ఈ నెల 9న రాత్రి జరిగిన గొడవ హింసాత్మకంగా మారడంతో ఇద్దరు వ్యక్తులపై బీరు బాటిళ్లతో దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులను సర్పవరం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్సై పి.శ్రీనివాస్‌కుమార్ వివరాల ప్రకారం గుడారిగుంటలో మద్యం దుకాణం వద్దకు వీరు 9న రాత్రి 8గంటల సమయంలో వెళ్లారు. చిన్న విషయమై గొడవ పడి బీరు బాటిళ్లతో ఇద్దరిపై దాడికి పాల్పడ్డారు. తీవ్ర రక్తస్రావంతో ఆస్పత్రిలో చేరిన బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులు గుడారిగుంటకు చెందిన సీకోటి రాజు, పెయ్యల ప్రసాద్, సీకోటి ప్రసాద్, కలాడి అర్జునరావుపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు.

క్లుప్తంగా

జర్మనీలో ఉద్యోగావకాశాలకు శిక్షణ

సామర్లకోట: జర్మనీలో ఉద్యోగావకాశాల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భాష శిక్షణతో పాటు మెకాట్రోనిక్స్ ఉద్యోగాల కోసం శిక్షణ ప్రారంభిస్తామని జిల్లా నైపుణాభివృద్ధి అధికారి ఎం. కొండలరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మెకాట్రోనిక్, ఎలక్ట్రికల్, ఎనర్జీ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ లేదా డిప్లమా కలిగి ఉన్నవారికి శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోపుగా దరఖాస్తులను పంపాలన్నారు, 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న స్త్రీ, పురుషులు అర్హులని చెప్పారు. ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చి కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. జర్మనీ వెళ్లడానికి వీసా, ఫ్లైట్ ఖర్చులు కంపెనీ భరిస్తుందన్నారు. భోజన, వసతి ఖర్చులను అభ్యర్థులు భరించవలసి ఉంటుందని తెలిపారు. నెలకు రూ.2.52 లక్షల నుంచి రూ.3.24 లక్షల వరకు జీతం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 94407 56250, 94910 77207 నంబర్లలో సంప్రదించవచ్చునని చెప్పారు.

తపోవనం మహాస్వామి మాతృమూర్తి శివైక్యం



జానకి (పాత చిత్రం)

తుని రూరల్: తుని మండలం కుమ్మరి లోవ తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామివారి మాతృమూర్తి జానకి (95) శివైక్యం చెందారు. బుధవారం స్వామివారి పూర్వాశ్రమం తల్లి జానకి ఆరోగ్యంగా తన పనులు తాను చేసుకుంటూ శివైక్యం చెందినట్టు ఆశ్రమ వర్గాలు తెలిపాయి. విషయం తెలియడంతో పలువురు ఆశ్రమానికి చేరుకుని పార్థివదేహాన్ని దర్శించి నివాళులు అర్పించారు. తాండవ నదీతీరంలో దహన సంస్కారాలు నిర్వహించారు.

తహసీల్దార్ ఆఫీస్ వద్ద గుండెపోటుతో రైతు మృతి

మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన



మృతుడు వెంకట్రావు (ఫైల్)



మృతదేహంతో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

దేవరపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గుండెపోటుతో రైతు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి ఉద్రిక్తతకు దారి తీసింది. మృతుడు దెయ్యాల వెంకట్రావు (44) కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. దేవరపల్లి మండలం లక్ష్మీపురానికి చెందిన వెంకట్రావు భార్య రత్నకుమారి, ఆమె అన్నదమ్ములకు 60 సెంట్ల భూమి ఉంది. దీనిని గ్రామ సర్వేయర్ దుర్గారావు అదే గ్రామానికి చెందిన పోలుమాటి రమేష్ పేరున ఆన్‌లైన్ చేశారు. దీనిని తమ పేరిట మార్చాలని 20 రోజులుగా వెంకట్రావు దంపతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో వెంకట్రావుకు సర్వేయర్ బుధవారం సాయంత్రం ఫోన్ చేసి, తహసీల్దార్ కార్యాలయానికి రావాలని చెప్పారు. దీంతో భార్య రత్నకుమారితో కలసి వెంకట్రావు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ మండల సర్వేయర్ దిల్లేశ్వరరావు, గ్రామ సర్వేయర్ దుర్గారావు, రైతు వెంకట్రావుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో వెంకట్రావు గుండెపోటుతో అక్కిడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే వెంకట్రావు మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో, ఆగ్రహించిన వెంకట్రావు కుటుంబ సభ్యులు, బంధువులు అతడి మృతదేహంతో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు. గ్రామ సర్వేయర్, మండల సర్వేయర్ వాగ్వాదానికి దిగడం వల్లే తన భర్త గుండెపోటుతో మృతి చెందారని, తన కుటుంబానికి న్యాయం చేయాలని రత్నకుమారి డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సై వి.సుబ్రహ్మణ్యం సంఘటన స్థలానికి చేరుకుని, మృతుని కుటుంబ సభ్యులు, బంధువులతో చర్చించారు. వెంకట్రావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పారదర్శకంగా పరీక్షల నిర్వహణ

'నన్నయ' వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



యూజీ, పీజీ పరీక్ష విభాగాన్ని పరిశీలిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: పరీక్షల నిర్వహణ, సర్టిఫికెట్ల మంజూరు వంటి విషయాలలో పారదర్శకంగా ఉండాలని, ఎక్కడ తేడా వచ్చినా క్షమించేది లేదని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ హెచ్చరించారు. యూనివర్సిటీలో యూజీ, పీజీ పరీక్షల విభాగాలను బుధవారం ఆమె నిశితంగా పరిశీలించారు. అనంతరం డీన్ అండ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కార్యాలయంలో పరీక్ష విభాగానికి చెందిన అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్న విధానం గురించి తెలుసుకుంటూనే ఆటోమేషన్ విధానాన్ని అమలు చేయడంపై ఆరా తీశారు. అనుబంధ కళాశాలలు ఎక్కువగా ఉన్నందున ఎక్కడా, ఎటువంటి సమస్య ఎదురుకాకుండా సమర్థంగా పరీక్షలు నిర్వహించడం కష్టతరమైన చర్యే అయినా సమష్టిగా పనిచేస్తే ఎటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడవచ్చన్నారు. డీన్ ఆచార్య డి.కల్యాణి, ప్రత్యేకాధికారి డాక్టర్ కె.దీప్తి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమారి, సిస్టమ్ మేనేజర్ జ్యోతి పాల్గొన్నారు.

ఆలోచన లేకుండా చేసే పనులతో ఇబ్బందులు



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

కంబాలచెరువు: ఆలోచన లేకుండా చేసే పనులతో ఇబ్బందులు ఎదురవుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీలక్ష్మి అన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. అక్కడి బాలురు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉచితంగా న్యాయవాదిని పొందే అవకాశం ఉందని తెలిపి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా, ఎటువంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. బాలురతో స్నేహ పూర్వకంగా ఉండాలని, వారికి మంచి ఆహారాన్ని అందించడంతో పాటు వారికి ఎలాంటి వైద్య సహాయం అవసరమైన వెంటనే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి చెప్పారు. అనంతరం కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని బీసీ బాలికల సమీకృత సంక్షేమ వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అన్యాయం జరిగితే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. మంచి చెడు స్పర్శలకు తేడాలను విద్యార్థినులకు తెలియజేశారు.

మోరంపూడి బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం

వ్యక్తి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

కంబాలచెరువు: మోరంపూడి ఫ్లై ఓవర్‌బ్రిడ్జిపై బుధవారం అర్ధరాత్రి ఓ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లాలాచెరువు నుంచి హుకుంపేట వైపు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళుతున్నారు. వారిని వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న ఇద్దరిలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి రోడ్డుపై తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడాడు. మృతుడు గుంటూరుకు చెందిన నరేష్ కాగా గాయపడ్డ వ్యక్తి పాలకొల్లుకు చెందిన బి.రమేష్. ఇరువురూ రైల్వే సైట్ సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్నారు. ప్రమాద సమయంలో అటుగా వెళుతున్న వాహనదారులు చూసి 108కి సమాచారం అందించారు. 108 వాహనం అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తిని బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు టైర్ పంక్చర్ కావడంతో అక్కడే ఆగిపోయింది. వాహనంలో ఉన్న వారు మద్యం తాగినట్టు తెలుస్తోంది.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శంఖవరం: ఏపీ మోడల్ స్కూల్ 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలోకి ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్టు స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 17 నుంచి మే 22 వరకు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించి గేట్‌వే ద్వారా అప్లికేషన్ రుసుము చెల్లించగా వచ్చిన జనరల్ నంబర్ ఆధారంగా వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.200, ఎస్సీ, ఎస్టీలకు రూ.150 రుసుము చెల్లించాలని తెలిపారు. మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు.

కంటిపూడి సుజుకి శాటిలైట్ డీలర్‌షిప్ ప్రారంభం



సుజుకి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సేల్స్ ఆర్ఎం శివరామకృష్ణ, కంటిపూడి గ్రూప్ ఎండీ వినయ్‌బాబు

రావులపాలెం: జపాన్ ఆటోమొబైల్ దిగ్గజమైన సుజుకి మోటార్ సైకిల్ అధీకృత డీలర్ కంటిపూడి సుజుకి నూతన శాటిలైట్ డీలర్ షిప్‌ను బుధవారం రావులపాలెంలో ప్రారంభించారు. కంటిపూడి సుజుకి షోరూమ్ అండ్ సర్వీస్‌ను సుజుకి సేల్స్ రీజినల్ మేనేజర్ శివరామకృష్ణ, కంటిపూడి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కంఠమనేని వినయ్‌బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటిపూడి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కంఠమనేని వినయ్ బాబు మాట్లాడుతూ కస్టమర్లకు మెరుగైన సేవలను అందించడానికి అత్యాధునిక ఆటోమేటిక్ పరికరాలు కలిగిన వర్క్‌షాప్‌ను రూపొందించినట్టు తెలిపారు. కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణమూర్తి (చినబాబు), కె.మన్మోహన్‌రామ్, సేల్స్ ఏఎం బాలకృష్ణ, సర్వీస్ ఏఎం సాయి, కంటిపూడి సుజుకి జీఎం రాజారావు, బ్రాంచ్ మేనేజర్ వంశీ, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పండిత సదస్యం



కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వేద పండితుల సదస్యం



కోరుకొండ గ్రామోత్సవంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు

ఆంజనేయ వాహనంపై లక్ష్మీ నరసింహుని గ్రామోత్సవం

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడవరోజు బుధవారం సదస్యం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి కల్యాణ మండపంలో వేద పండితులు, ఉభయ వేదాంత పండితుల సమక్షంలో సదస్యం జరిగింది. ఉదయం గ్రామబలిహరణ, సాయంత్రం ఆరాధన, సర్వదర్శనములకు అనుమతి, సేవాకాలం జరిగింది. తీర్థ ప్రసాద గోష్ఠి కార్యక్రమంలో భాగంగా భక్తులకు బూరెలు అందజేశారు. రాత్రి శ్రీఆంజనేయ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పరాసర రంగరాజభట్టర్, అన్నవరం దేవస్థానం అధికారులు, వేద పండితులు పాల్గొన్నారు.